## క్లుప్తంగా

### 15లోగా ఈకేవైసీలు పూర్తి చేయాలి



మురమళ్లలో ఈకేవైసీ చేస్తున్న అధికారులు

ఐ.పోలవరం: మండలంలోని రైతులు ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీలు వచ్చేనెల 15లోగా చేసుకోవాలని డీఏఓ ఓలేటి బోసుబాబు అన్నారు. మండలంలో మంగళవారం వ్యవసాయ సిబ్బందితో కలసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వీఏఏ, వీహెచ్ఏలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకూ ఏవిధంగా సిబ్బంది చేస్తున్నారన్నది పర్యవేక్షించారు. ఏఓ ఎం.వాణి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 4,788 ఎకరాలు రైతులు సాగు చేస్తున్నారని, జి.మూలపాలెం, జి.వేమవరం, ఎదుర్లంక గ్రామాల్లో రైతులు ఖరీఫ్ నారుమడులు వేసేందుకు సాహసించడం లేదన్నారు. వీరి వెంట పి.శ్రీను, దుసీషా ఉన్నారు.

### జోనల్ స్కూల్ గేమ్స్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: జోనల్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ 2023–24 క్రీడాపోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి ఈ పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో పోటీలలో పాల్గొనాలని ఆర్ఏఓ సూచించారు. ఈ పోటీలలో ప్రభుత్వ కళాశాల, ప్రైవేటు, ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, హెచ్ఎం పువ్వల రాజారామ్‌మోహన్‌రావు, జోనల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాము సత్యనారాయణ, పీఎస్ ప్రకాష్ పాల్గొన్నారు.

### ఇన్విజిలేటర్లకు శిక్షణ

యానాం: ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న ఎల్‌డీసీ పరీక్షలకు సంబంధించి మంగళవారం ఇన్విజిలేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చి పలు సూచనలు చేశారు.

### విద్యుత్ ఉద్యోగిపై దాడి చేసిన నలుగురి అరెస్టు



గాయపడిన ఆపరేటర్ శిరీష్

అమలాపురం రూరల్: మండలంలో కామనగరువు అబ్బిరెడ్డి రామదాసు కాలనీలో రూరల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్ చీకట్ల శిరీష్‌పై దాడి చేసిన నలుగురిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ అంబికాప్రసాద్ మంగళవారం రాత్రి తెలిపారు. కామనగరువు కరక్కాయపేటకు చెందిన నలుగురు సోమవారం రాత్రి సబ్‌స్టేషన్‌కు వచ్చి కరెంట్ ఎందుకు ఆపు చేశావు అని తిట్టి, కేకలు వేసి అక్కడ ఉన్న షిఫ్ట్ ఆపరేటర్, సిబ్బందిపై దౌర్జన్యం చేశారు. అధికారుల ఉత్తర్వుల ప్రకారం ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్‌గా కోత విధించామని చెబుతున్నప్పటికీ వారు వినకుండా దౌర్జన్యంగా సబ్‌స్టేషన్‌లోకి వచ్చి షిఫ్ట్ ఆపరేటర్‌ను కొట్టి, అక్కడ ఉన్న కుర్చీలు, మీటర్లు, సామాన్లు చెల్లా చెదురుగా పడవేశారు. అక్కడ ఉన్న మిగతా సిబ్బంది ఇద్దరు అడ్డుకోబోయినా ఆగలేదు. ఈ సమాచారం తెలిసిన వెంటనే తాలూకా పోలీస్ ఎస్సై అందే పరదేశి, పోలీసులు వెళ్లి నలుగురిని అదుపులో తీసుకున్నారు. గాయాల పాలైన షిఫ్ట్ ఆపరేటర్ శిరీష్‌ను ఆసుపత్రికి తరలించారు. అతని ఫిర్యాదుపై అమలాపురం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగిని కొట్టడం, ప్రభుత్వ ఆస్తిని పాడు చేయటం వంటివి చేసినందుకు నిందితులు కామనగరువుకు చెందిన గొల్లపల్లి లక్ష్మీనాగభూషణం, భీమవరపు అమృతరావు, కొనుకు వర్ధన్, కొనుకు నవీన్‌లను మంగళవారం రాత్రి అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. రూరల్ సీఐ వీరబాబు నేతృత్వంలో ఎస్సై పరదేశి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు

అంబాజీపేట: శ్రావణ మంగళవారం పురస్కరించుకుని మాచవరంలో వేంచేసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు మాచరి సూరిబాబు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వరునికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

# ప్రగతికి ఊతం

- అడిగిన వెంటనే ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు ఇస్తానని ప్రకటన
- 'గడప గడపకూ మన ప్రభుత్వం' ద్వారా మౌలిక వసతులకు పెద్ద పీట
- అమలాపురం నియోజకవర్గానికి సీఎం జగన్ స్పెషల్ గ్రాంట్

అమలాపురం టౌన్: ఈ నెల 11న అమలాపురం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రి పినిపే విశ్వరూప్ అడిగిందే తడవుగా నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. సాధారణంగా విడుదలయ్యే నిధులకు తోడు నియోజకవర్గానికి స్పెషల్ గ్రాంట్ కింద సీఎం జగన్ నిధులు మంజూరు చేశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు చరమగీతం పాడేలా మూడు ప్రత్యామ్నాయ వంతెనల నిర్మాణాలకు రూ.10 కోట్లు కేటాయించారు. నియోజకవర్గంలోని 84 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కింద ప్రత్యేక గ్రాంటు ప్రకటించారు. ఈ రెండు అంశాలకు నిధులు మంజూరు చేయాలన్న మంత్రి విశ్వరూప్ అభ్యర్థనకు ఆ రోజు అమలాపురంలో జరిగిన బహిరంగ సభలో సీఎం జగన్ ఆమోద ముద్ర వేసిన సంగతి తెలిసిందే. సాధారణంగా 'గడప గడపకూ మన ప్రభుత్వం' ద్వారా ప్రజల నుంచి వచ్చే వినతులను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు ఇస్తుంది. అయితే జిల్లా కేంద్రం అమలాపురం నియోజవర్గాన్ని ప్రత్యేక దృష్టితో చూసి ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షల వంతున నిధుల ఇవ్వాలని మంత్రి విశ్వరూప్ ఆ సభా వేదికపై సీఎం జగన్‌ను అభ్యర్థించారు. దీనిపై స్పందించిన జగన్ నియోజకవర్గంలోని 84 సచివాలయాలకు ఒక్కో దానికి రూ.40 లక్షల వంతున నిధుల ఇస్తానని మాట ఇచ్చారు.

**అదనంగా రూ.20 లక్షలు**

నియోజకవర్గంలో ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం కింద పలు సచివాలయాలకు రూ.20 లక్షల వంతున విడుదలైన నిధులతో ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాలైన సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్లు, సామాజిక భవనాలు, మురుగు కాల్వల నిర్మాణం వంటి అభివృద్ధి సాకారమవుతోంది. ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలకు తోడు మరో రూ.20 లక్షలు కలిపి మొత్తం రూ.40 లక్షలతో మరిన్ని అభివృద్ధి పనులు జరగనున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని అమలాపురం మండలం నడిపూడి, వన్నె చింతలపూడి, ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మితమవుతున్నాయి. వీటికి అదనపు నిధులు కూడా తోడై గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో కూడిన ప్రగతి మరింత పరుగులు పెట్టనుంది.



నడిపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో నిర్మితమవుతున్న సీసీ రోడ్డు

### అడిగిన వెంటనే స్పందించిన సీఎంకు కృతజ్ఞతలు



"జిల్లా కేంద్రం అమలాపురం నియోజకవర్గానికి సంబంధించిన రెండు ప్రధాన సమస్యలు సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకుని వెళ్లినప్పుడు ఆయన అడిగిన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారు. ఆయనకు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు. సీఎం జగన్‌ను ఏదైనా అడిగితే తక్షణమే స్పందించే గుణమే కాదు... అమలాపురం నియోజకవర్గంపై ఆయనకున్న ప్రత్యేక అభిమానం కూడా ఈ నిధుల కేటాయింపు ద్వారా మరోసారి తేటతెల్లమైంది."

– పినిపే విశ్వరూప్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి

### గ్రూప్-1 ఐదవ ర్యాంకర్‌కు సత్కారం



గ్రూప్ -1 ర్యాంకర్ భానుప్రకాష్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఉప్పలగుప్తం: ఇటీవల విడుదలయిన ఏపీపీఎస్సీ గ్రూప్–1 ఫలితాల్లో ఐదవ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన మిమ్మితి భానుప్రకాష్‌రెడ్డిని పలువురు అభినందించారు. అంబేడ్కర్ జిల్లా సాధన సమితి ఉప్పలగుప్తం మండల కన్వీనర్ కుంచే బాబులు ఆధ్వర్యంలో అనాతవరం భానుప్రకాష్ నివాసంలో మంగళవారం పూలమాలలు వేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, గుత్తాల సుభాష్ చంద్రబోస్, దేవరపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## పిల్లంక సచివాలయ భవనం ప్రారంభం



పిల్లంక సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: పిల్లంక గ్రామ పంచాయతీలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నేత చింతలపాటి శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పిల్లంక పంచాయతీని ఆదర్శ గ్రామంగా, సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దేందుకు శ్రీనివాసరాజు కృషి చేస్తున్నారని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికలలో అండగా ఉండాలని కోరారు. సచివాలయ భవన నిర్మాణానికి స్థలాన్ని దానం చేసిన సాగి భాస్కరరాజు సోదరులు రామరాజు, వెంకట కృష్ణంరాజు, కుమారుడు వీరభద్రరాజులతోపాటు భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్ పెంకే అర్జున్‌లను ఎమ్మెల్యే పొన్నాడ సత్కరించారు. ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాద గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీలు ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు మోర్త భీమాబాయి పాల్గొన్నారు.

## పేదలకు వస్త్ర, అన్నదానాలు



వస్త్రదానం చేస్తున్న అభిమాన సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు

అమలాపురం టౌన్: కేంద్ర మాజీ మంత్రి, మెగాస్టార్ చిరంజీవి 68వ జన్మదిన సందర్భంగా అమలాపురంలో ఆయన అభిమానులు మంగళవారం వస్త్ర, అన్నదానాలను నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సర్క్యులర్ బజార్ ప్రాంగణంలో చిరంజీవి యువత రాష్ట్ర ప్రతినిధి నల్లా చిట్టిబాబు, అఖిల భారత ఉపాధ్యక్షుడు యేడిద శ్రీను, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి నల్లా నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. మున్సిపల్ మాజీ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, డాక్టర్ కొమ్ముల ధ్వనంతరి నాయుడు ముఖ్య అతిథులు పాల్గొని చిరంజీవి సేవా తత్పరత గురించి ప్రసంగించారు. తొలుత చిరంజీవి ముఖ చిత్రంతో ఉన్న భారీ కేక్‌ను కట్ చేశారు.

**ముమ్మిడివరంలో..**

ముమ్మిడివరం: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక లంకతల్లమ్మ గుడి వద్ద చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం చిరంజీవి సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గోదశి పుండరీష్, త్సవట పల్లి నాగభూషణం, దాట్ల బాబు, నల్లా ప్రసాద్‌బాబు, కర్రా దుర్గాప్రసాద్, రంభాల శంకర్, దూడల స్వామి పాల్గొన్నారు.

**మురమళ్లలో..**

ఐ.పోలవరం: పద్మభూషణ్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు మంగళవారం మండలంలో అభిమానులు ఘనంగా జరుపుకొన్నారు. మురమళ్ల మాణిక్యాంబ ఆలయం వద్ద అభిమానులు భారీ అన్న సమారాధన, కేక్ కటింగ్ చేశారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కేశనకుర్రు, కొమరగిరి, గుత్తినదీవి, జి.వేమవరం గ్రామాల్లో కేక్ కట్ చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారం దిశగా...

- పోలేకుర్రులో ఉత్సాహంగా గడప గడపకూ మన ప్రభుత్వం
- జనం నుంచి విశేష స్పందన



సంక్షేమ పథకాల వివరాల కరపత్రం వృద్ధురాలికి అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. పోలేకుర్రు పంచాయతీలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఎమ్మెల్యే పొన్నాడ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న పలు రహదారులు నిర్మించాలని, పి.మల్లవరం నుంచి పోలేకుర్రుకు ఉన్న రైతుపుంతకు రహదారి నిర్మించాలని మహిళలు కోరగా అంచనాలు వేయించాలని స్థానిక సర్పంచ్ వెంటపల్లి నూకరాజును ఎమ్మెల్యే పొన్నాడ ఆదేశించారు. గృహ రుణాలు అందించాలని పలువురు లబ్దిదారులు కోరారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాలుగున్నరేళ్లలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. పలుచోట్ల మహిళలు ఎమ్మెల్యే పొన్నాడకు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి, ఎరికే వీరబాబు, రేవు మల్లీశ్వరి, పెయ్యల మంగేష్, పోతుల రత్నకుమారి పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే జగనన్న ధ్యేయం

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- చల్లపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల వివరాలు లబ్ధిదారునికి అందిస్తున్న శ్రీకాంత్

ఉప్పలగుప్తం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని చల్లపల్లి గ్రామ పంచాయతీ సచివాలయం 3 పరిధిలో చింతలచెరువు, ఎరుబండి చెరువు, చినపేట ప్రాంతాల్లో ఎంపీడీవో కె.ఎస్.గౌరీకుమారి ఆధ్వర్యంలో అధికారులతో కలసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ గడపకూ వెళ్లి సీఎం జగనన్న ప్రభుత్వం పనితీరు ఎలా ఉంది, అన్నీ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. గ్రామంలో పర్యటించిన ఆయనకు గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందిగా ఉందని తెలుపగా, అధికారులు వాటిని పరిగణలోకి తీసుకుని సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఎరుబండి చెరువు ప్రాంతంలో శ్మశానవాటికకు గ్రావెల్ రోడ్డు సౌకర్యం కావాలని శ్రీకాంత్‌ను కోరారు. మంత్రి విశ్వరూప్‌కు తెలియజేసి అధికారులు పనులు ప్రారంభించేలా చూస్తామని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, కార్యదర్శి పినిపే జయరాజు, సొసైటీ అధ్యక్షుడు దంగేటి దొరబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ బడుగు మేరీకుమారి, పార్టీ నాయకులు భోగిశెట్టి నరసింగ్, వరసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

### మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుంది



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అమలాపురం రూరల్: కేంద్రంలో 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఈసారి రాజ్యాంగాన్ని మార్చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. రూరల్ మండలంలోని పేరూరు ఉన్న బీఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. అప్పట్లో బీజేపీకి పార్లమెంట్‌లో అంతగా బలం లేనందున రాజ్యాంగ సవరణ వంటి అంశాలను ప్రస్తావించలేదన్నారు. మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులకు సంబంధించిన వివరాలపై తాను ఢిల్లీలోని కేంద్ర ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్, తాటిపాక మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి కారేం వెంకటేశ్వరరావు, కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి పాల్గొన్నారు.

## బాధాతప్త హృదయాలతో బీబీ సకీనా వర్ధంతి



బీబీ సకీనా చరిత్ర వివరిస్తున్న నజఫి

అమలాపురం టౌన్: స్థానిక గొల్లగూడెంలో గల అషుర్ ఖానాయే బీబీ సకీనా పీర్ల పంజా వద్ద షియా ముస్లింలు బాధాతప్త హృదయాలతో బీబీ సకీనా వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. వర్ధంతి కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మౌలానా తన్వీర్ అబ్బాస్ నజఫి మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త మనమడు ఇమామ్ హుస్సేన్ కుమార్తె బీబీ సకీనాను షియా ముస్లింలు ఎన్నటికీ మరువలేరని చెప్పారు. బీబీ సకీనాను నాలుగేళ్ల ప్రాయంలో చిత్ర హింసలకు గురి చేసిన ఘటనలను వివరించారు. స్థానిక ముస్లిం వీధిలో మాతం నిర్వహించారు. హైదరాబాద్, విశాఖపట్నం, మచిలీపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం నుంచి వచ్చిన ముస్లింలు మాతంలో పాల్గొన్నారు. స్థానిక పీర్ల పంజా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మాతం జరిగింది. వీధుల్లో ఊరేగింపు చేపట్టారు.

**రొట్టెలు, పాలు పంపిణీ**

బీబీ సకీనా వర్ధంతి వేడుకల్లో కోనసీమ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ దూర ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లింలకు రొట్టెలు, పాలు పంచిపెట్టింది. స్థానిక గొల్లగూడెం జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎండీ ఆజామ్, ఎండీ బషీర్, ఎండీ అలీషా, ఎండీ షరీఫ్, రాజేష్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సఖినేటిపల్లి: మండలంలోని గుడిమూల శివాలయం రోడ్డులో సోమవారం బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు రోడ్డు మార్జిన్‌లోని విద్యుత్ పోల్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో బైక్‌తో సహా రోడ్డుపై పడి, తీవ్ర గాయాలైన ఇరువురినీ స్థానికులు 108 అంబులెన్స్‌లో రాజోలు ఏరియా ఆసుపత్రికి తరలించారు. గొంది నుంచి గుడిమూల ఏటిగట్టు వైపునకు బైక్‌పై వీరు వెళుతున్నట్టు, గొంది ఏటిగట్టున వీరబ్రహ్మం ఆలయం వద్ద నివాసితులు ఎన్.పండు, వై.వినాయక్‌లుగా గుర్తించారు.



## సేల్స్ గర్ల్‌ను ఏమార్చి రూ.10 వేలు అపహరణ

**పెయింట్స్ షాపులో ఇద్దరు అపరిచిత వ్యక్తుల మోసం**



క్యాష్ కౌంటర్‌లో చేయి పెట్టిన అపరిచిత వ్యక్తి (సీసీ ఫుటేజీ చిత్రం)

అమలాపురం టౌన్: స్థానిక మైపాల వీధిలో గల శ్రీసూర్య పెయింట్స్ షాపులో పనిచేస్తున్న సేల్స్ గర్ల్‌ను ఇద్దరు అపరిచిత వ్యక్తులు ఏమార్చి క్యాష్ కౌంటర్ నుంచి రూ.10 వేలు కాజేసి పరారయ్యారు. షాపు యాజమాని మంగళవారం మధ్యాహ్నం ఇంటికి భోజనానికి వెళుతూ షాపును సేల్స్ గర్ల్‌కు అప్పగించి వెళ్లారు. ఇంతలో ఇద్దరు అపరిచిత వ్యక్తులు షాపులోకి వచ్చి చిన్నపాటి వస్తువులు కొనుగోలు చేసి రూ.500 నోటు ఇచ్చారు. ఆ సేల్స్ గర్ల్ వారికి తిరిగి చిల్లర ఇచ్చే క్రమంలో నోట్లు బాగోలేదంటూ వారే క్యాష్ కౌంటర్‌లో పదే పదే చేతులు పెట్టారు. ఇదే సమయంలో సేల్స్ గర్ల్‌ను ఏమార్చి రూ.10 వేలు కాజేశారు. క్యాష్ కౌంటర్‌లో వారిద్దరూ చేతులు పెట్టి నోట్లను చూపిస్తున్న దృశ్యాలు, సేల్స్ గర్ల్ అలా చేతులు పెడుతున్నా వారించని దృశ్యాలు ఆ షాపు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఓ పథకం ప్రకారం షాపునకు వచ్చిన ఇద్దరు అపరిచిత వ్యక్తులు దూరంగా మోటారు సైకిల్‌ను నిలిపి ఈ మోసానికి పాల్పడినట్లు షాపు సిబ్బంది గుర్తించారు. నగదు దోచుకున్న తర్వాత వారు అక్కడ నుంచి దర్జాగా జారుకున్నారు. జరిగిన మోసాన్ని షాపు యజమాని వచ్చి గ్రహించారు. షాపు యాజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్యాష్ కౌంటర్ నుంచి సేల్స్ గర్ల్ కళ్లు గప్పి డబ్బులు కాజేసినట్టు సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. నిందితులను గుర్తించినవారికి రూ. ఐదువేలు రివార్డు ఇస్తామని డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ చెప్పారు.

## పోలీసు స్టేషన్ నుంచి అనుమానితుడి పరారీ

**కొద్దిసేపటి తర్వాత పట్టుకున్న పోలీసులు**

అమలాపురం టౌన్: పోలీసులు అనుమానితుడిగా అదుపులోకి ఓ వ్యక్తి మంగళవారం ఉదయం స్టేషన్ నుంచి పరారయ్యాడు. అయితే కొద్దిసేపటి తర్వాత అతడిని తిరిగి అదుపులోకి తీసుకున్నారు. తమ రోడ్డులో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని స్థానిక పద్మినీపేట నుంచి ఓ యువతి మంగళవారం తెల్లవారు జామున 112కి కాల్ చేసింది. ఆ కాల్‌ను అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని అమలాపురం రూరల్ మండలం కామనగరువుకు చెందిన యువకుడిగా గుర్తించారు. మంగళవారం ఉదయం స్టేషన్ నుంచి ఈ వ్యక్తి తప్పించుకోవడంతో పోలీసులు అతని కోసం వెతికారు. కొద్దిసేపటి తర్వాత వచ్చిన ఆ యువకుడు కాల కృత్యాలు తీర్చుకోవడానికి బయటకు వెళ్లానని పోలీసులకు వివరణ ఇచ్చాడు. ఈ విషయమై డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్‌ను వివరణ కోరగా అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని తీసుకుని వచ్చినప్పుడు ఇలా జరిగిందని.. ఆ వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడిపై ఎవరూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయలేదని చెప్పారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న అతనిని విచారిస్తున్నామని తెలిపారు.

## 9న లోక్ అదాలత్

ముమ్మిడివరం: తమ కమిటీ ఆధ్వర్యంలో వచ్చే నెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహతుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, ఎంవీ, డీవీసీ, ఎన్ఐ యాక్ట్, బీఎస్ఎన్ఎల్ కేసులు రాజీ చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ దోహద పడుతుందన్నారు.